క్లుప్తంగా

నూతన వస్త్రాల బహూకరణ



పెదమద్దాలి(పామర్రు): పేదలైన వితంతువులకు దాత సహకారంతో నూతన వస్త్రాలను బహూకరించినట్లు సంఘ కాపరి సమ్మంగి కృష్ణపాల్ అన్నారు. మండలంలోని పెదమద్దాలి సెయింట్ పాల్ చర్చిలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు కంభం సీతారామశాస్త్రి జ్ఞాపకార్థం నిర్మలమ్మ సౌజన్యంతో ఈ వస్త్రాలను అందజేశామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పామర్రు: నియోజకవర్గంలోని బాధిత కుటుంబాల వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 12 మంది బాధిత కుటుంబాలకు చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా పీసీ వైస్ చైర్మన్ వల్లూరి పల్లి గణేష్, పామర్రు డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌చంద్ర పాల్గొన్నారు.

మండవల్లిలో నగర సంకీర్తన



మండవల్లి: శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం నందు ధనుర్మాస సందర్భంగా ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వెళ్లి భిక్ష స్వీకరించారు. స్థానిక స్టేషన్‌రోడ్, అగ్రహారంలో కార్యక్రమం నిర్వహించారు. గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా జీవించాలి



గుడివాడరూరల్: రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని నేరాలకు దూరంగా క్రమ శిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్. చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు.

గ్రామాల్లో పండగ వాతావరణం



పామర్రు: గ్రామాల్లో సంక్రాంతి పండగ వాతావరణం వచ్చేసింది. ఆదివారం పామర్రు గ్రామంలో గంగిరెద్దులు సందడి మొదలైంది. ఇంటింటికీ తిరిగి గంగిరెద్దులను ఆడించారు. ఇంటికి వచ్చిన గంగిరెద్దులకు గృహిణిలు వస్త్రాలు తదితరాలను దానంగా ఇచ్చారు. సంక్రాంతి నేపథ్యంలో లోగిళ్లను రంగ వల్లులతో తీర్చి దిద్దుతున్నారు. పంటలు పండి ఇళ్లకు వచ్చే సమయం కావడంతో గంగిరెద్దులకు బియ్యం, ధాన్యాన్ని ఇస్తున్నారు. ధనుర్మాసంలో దానం చేస్తే మంచి ఫలితం వస్తుందని ఆచార్యులు చెప్పిన సూక్తులను ప్రతిఒక్కరు ఆచరిస్తున్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అధికమైంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

వదలని ముసురు

ఐదు రోజులుగా వాతావరణంలో మార్పుతో వేసిన ముసురు వదలనంటోంది. దీంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. చాలామంది రైతులు ధాన్యాన్ని ఇంకా ఇళ్లకు చేర్చుకోలేదు. పూటకోవిధంగా వాతావరణం మారుతోంది. ఒక్కో రోజు చిరు జల్లులు కురుస్తుండడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుడ్లవల్లేరు: నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో సాగవుతున్న వరి సగం మేరకు కోత కోశారు. కాగా ఆ ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ప్రస్తుం కొనసాగుతున్న ముసురుతో ఇబ్బందులకు గురవుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కోస్తున్న వరి కోతలతో కొంత పంట పనలు మీద ఉంది. ఇంకా కల్లాల్లో, రోడ్ల మీద ధాన్యాన్ని రైతులు అమ్ముకోవాల్సి ఉంది. కోతకొచ్చిన పొలాల రైతులు మాత్రం మళ్లీ ఈ ముసురుతో తమ పంటలు ఏమైపోతాయోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తమ పంటకు సరైన మద్దతు ధర అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.1,725 ప్రభుత్వ మద్దతు ధర ఉంటే... నిబంధనల పేరిట రూ.1,400లే రైతులకు జమ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల గుండెల్లో రైళ్లు



రోడ్డు మీద ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు

మిల్లర్లపై ప్రభుత్వ కట్టడి ఏదీ?



కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లను కట్టడి చేయలేకపోతోంది. తేమ శాతం నిర్ణయించాల్సిన ఆర్ఎస్కేలు అయితే మిల్లర్లు తేమ శాతం నిర్ణయించటం ఏమిటి? ఇక్కడ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పక్కన పెట్టేసి.. మిల్లర్ల పెత్తనం ఏంటి? రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందే.
– నీలం మురళీ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ మాజీ కార్యదర్శి

గత మునకతో ఎకరానికి 18 బస్తాలే..



ఫెంగల్ తుపానుకు పంటంతా మునిగిపోయింది. దానిని కోత కోయించినందుకు తడిసి మోపెడు అయ్యింది. మూడు ఎకరాలను కట్టుబడికి తీసుకున్నాను. సాగు ఖర్చు కూడా వచ్చే అవకాశం కనబడటం లేదు. ఎకరానికి 18 బస్తాలే అయ్యాయి. ఆ పంటను కట్టుబడి కింద రైతుకు ఇచ్చేస్తున్నాను.
– అనగాని రాము, కౌలు రైతు, పురిటిపాడు, గుడ్లవల్లేరు మండలం

భగవంతుడే కాపాడాలి



మొన్న ఫెంగల్ తుపాను వచ్చి నట్టేట ముంచింది. ఇపుడు పడిన వాయుగుండం రాకుండా ఉండాలని ఆ భగవంతుడ్ని మా రైతులంతా ప్రార్థిస్తున్నాం. ఈసారి పంట వర్షానికి తడిస్తే ఎందుకూ పనికి రాకుండా పోతుంది. ఇప్పటికే ధాన్యానికి మద్దతు ధర ఇవ్వకుండా కోత విధిస్తున్నారు. వేరే గత్యంతరం లేక అమ్ముతున్నాం.
– గొర్రై శివనారాయణ, రైతు, మోటూరు, గుడివాడ రూరల్ మండలం

పనల మీద పంట



వరిపంట కోతలు కోయించేసి పనలు మీద ఉంచాం. ఈ సమయంలో వర్షం వచ్చిందటే నిండా మునిగినట్లే. ఇప్పటికే ధాన్యం మద్దతు ధర రూ.1,725 ఉంటే కేవలం రూ.1,400కే కొంటున్నారు. పనల మీద పంట తడిసిందంటే ఇక అంతే సంగతులు. ధాన్యానికి ధర రాకపోవటంతో సాగు ఖర్చు కూడా చేతికి రాకుండా పోతుంది.
– ఆరేపల్లి మురళి, రైతు, మోటూరు, గుడివాడ రూరల్ మండలం

సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో విద్యావికాస్ చిన్నారులు

గుడివాడరూరల్: స్థానిక విద్యావికాస్ ఇంగ్లిష్ మీడియం బ్లూమ్స్, ప్రైమరీ, హైస్కూల్లోఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్‌ను పాఠశాల డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు కట్ చేసి చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ నాటికలు, నృత్యాలు, పాటలతో చూపరులను అలరించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కైకలూరు: సెమీ క్రిస్మస్ వేడుకను నిమ్మగడ్డ నాగభూషణం ఉన్నత పాఠశాల్లో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఏసు ప్రేమ సందేశాన్ని అందించారు. వాకర్స్ కారి శరత్‌బాబు, బందెల లక్ష్మణరావు, తంబాల వినోద్‌కుమార్, కర్రై డేవిడ్‌రాజు, కోటేశ్వరరావు, వీర్రాజు, మోహన్ పాల్గొన్నారు.

గ్రేస్ ఇమ్మానియేల్ చర్చిలో..

గుడివాడరూరల్: శ్రీకాళహస్తీ కాలనీలోని గ్రేస్ ఇమ్మానియేల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం పాస్టర్ వేసపోగు విజయబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్యాండిల్స్‌ను వెలిగించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరపల్లి వినయ్‌బాబు, మురళీ, పిచ్చయ్య, పాస్టర్ జాక్‌టిమ్ పాల్గొన్నారు.



కైకలూరు హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుక



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్ వేసపోగు

ఘనంగా శారదాదేవి జయంతి



కైకలూరు: మాతా శారదాదేవీ జయంతి వేడుక ఎన్జీవోస్ కాలనీ రామకృష్ణ ధ్యాన మందిరంలో భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. అమ్మకు విశేష పూజలు, లలితా సహస్రనామ పారాయణ, నివేదన, హారతీ, పుష్పాంజలి అనంతరం భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. ధ్యానమందిర కార్యదర్శి ఉయ్యూరి రాజేశ్వరరావు శారదాదేవీ జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ధ్యానమందిర అధ్యక్షుడు భూపతిరాజు వేంకటేశ్వర్వ, సభ్యులు చింతపల్లి వెంకటనారాయణ, చిట్టి పార్వతీశం, చంద్రాల మూర్తి, పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి దేవస్థానానికి వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని దాసాంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి దాత రూ. 10 వేలు విరాళాన్ని అందజేశారు. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు మేడేపూడి రామ్మోహనరావు ఆదివారం ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా గణిత దినోత్సవం



విద్యార్థులు ప్రదర్శించిన గణిత అంశాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మొవ్వ: స్థానిక శ్రీమండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్లో గణితోపాధ్యాయురాలు మేక రాణి పర్యవేక్షణలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 70 మందికి పైగా విద్యార్థులు ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. గణిత మెజీషియన్ శ్రీనివాస రామానుజన్ పై రంగవల్లుల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పసుపులేటి శివ కోటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు కేఎస్‌వీడీ రాంబాబు, పి. గోవిందరాజులు, కె.ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని ర్యాలీ



ఆర్తమూరు కూడలి వద్ద బైక్ ర్యాలీ

బంటుమిల్లి: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసేందుకు హిందూ బంధువులను చైతన్య పరుస్తూ ఆదివారం పలు గ్రామాల్లో సన్నాహక బైక్ ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ బంటుమిల్లి శాఖ ఆధ్వర్యంలో సాతులూరు, కొర్లపాడు, నారాయణపురం, మణిమేశ్వరం, ఆర్తమూరు, ముంజులూరు, బర్రిపాడు, కంచడం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. హిందూ బంధువులకు కరపత్రాలు అందజేసి ఆహ్వానం పలుకుతూ గృహాలకు స్టిక్కర్లను అంటించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాలయాల వద్ద జరుగుతున్న వ్యాపార ధోరణిని, అపచారాలను దృష్టిలో పెట్టుకుని దేవాలయాలను తిరిగి హిందువులకు అప్పగించాలని కోరుతూ ఏర్పాటు చేసిన హైందవ శంఖారావంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ ర్యాలీలో వీహెచ్‌పీ మండల ప్రతినిధులు ఇల్లూరి నాగబాబు, పుప్పాల నరసింహారావు, కంఠమేని మురళీమోహన్, వసంతరావు, తోకల స్వాములు, సీహెచ్ రాధాకృష్ణ, వి.కరుణ కుమార్ తదితర గ్రామాల యువకులు పాల్గొన్నారు.

దాత సాయంతో ఐరన్ రెయిలింగ్ ఏర్పాటు



ఆలపాడు గ్రామానికి చేరే వంతెనకు ఏర్పాటు చేయించిన ఐరన్ రెయిలింగ్

కైకలూరు: పుట్టిన గ్రామానికి సేవ చేయాలనే తలంపుతో రూ.10 వేలు వెచ్చించి కూలిన వంతెన గోడ స్థానంలో ఐరన్ రెయిలింగ్‌ను ఆలపాడు మాజీ సర్పంచ్ బండి మారయ్య మనవుడు శేషు ఆదివారం ఏర్పాటు చేయించారు. హైదరాబాదులో శేషు స్థిరపడ్డారు. జాతీయ రహదారి నుంచి ఆలపాడు వెళ్లే రహదారి ప్రారంభంలో వంతెన గోడ ఇటీవల కూలింది. రెయిలింగ్ ఏర్పాటు చేయించిన దాతను పలువురు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ



గుడ్లవల్లేరు: మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ బ్రిడ్జిపై వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద శనివారం రాత్రి పేద గిరిజన కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీని చేపట్టారు. చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని వెణుతురుమిల్లి మాజీ సర్పంచ్ పామర్తి వీర వెంకటరామ్మోహనరావు, కిరణ్‌కుమార్ ఆర్థికసాయంతో నిర్వహించారు. వెణు తురుమిల్లి, పెంజెండ్ర, శేరీ కల్వపూడి, అంగలూరు, చంద్రాలలో కేకులను కట్ చేసి మిఠా యిలు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు బలుసు జితేంద్ర, గుదే రవి, పెనుమాల రంగారావు, మేకల అనిల్, సుభాని, చంద్రశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా చిన్నయ్యసూరి జయంతి



చిన్నయ్యసూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు భాష వికాస సమితి సభ్యులు

గుడివాడరూరల్: పరవస్తు చిన్నయ్యసూరి జయంతి వేడుకలను గుడివాడ భారతి వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో చిన్నయ్యసూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గుడివాడ ఎంఈఓ బాలాజీ, భారతి సతిమి సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భాషకు సక్రమమైన వినియోగానికి వ్యాకరణం తప్పనిసరి అని పేర్కొన్నారు. అదేవిధంగా సమాజంలో బాల్యం నుంచే నైతిక విలువల బోధనకు చిన్నయ్యసూరి రచించిన బాల వ్యాకరణం, నీతిచంద్రికలు ఎంతగానో ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. అనంతరం రుద్రపాక జెడ్పీ హైస్కూల్ తెలుగు అధ్యాపకురాలు పోలుకొండ రాజకుమారికి చిన్నయ్యసూరి సాహితీపురస్కారం–24ను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, సాహితీ కన్వీనర్ లంక సురేంద్ర, సభ్యులు దొడ్డపనేని శేషగిరిరావు, గాదే మోహన్ బాబు, ఎం.మాధవరావు, ఆర్‌వీఎల్ నరసింహారావు, వంగా శ్రీనివాస్, ఆవిర్నేని వెంకటేశ్వరరావు, సయ్యద్ గఫార్, రాజకుమారి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి లక్ష తులసీదళ పూజ



ఆలయ ప్రాంగణంలో గోపూజ చేస్తున్న భక్తులు



లక్ష్మీ నరసింహస్వామి

పామర్రు: కాయిపురం గ్రామానికి చెందిన శ్రీభూనీలా రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసీ దళ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని స్వామివార్లకు పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గో పూజా కార్యక్రమంలో భాగంగా ఆవు దూడలకు విశేష పూజలను చేశారు. తదుపరి ఆలయ కల్యాణ మండపంలో లక్ష్మీ నృసింహస్వామివార్లకు శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఎనమంద్ర శ్రీనివాస్ శాంతిశ్రీ దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. రొంపిచర్ల సాయి ఆధ్వర్యంలో పై పూజా కార్యక్రమాలను చేయించినట్లు ఆలయ అర్చకులు వేదాంతం శ్రీధరాచార్యులు తెలిపారు.

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల విహార కేంద్రం పర్యాటకులతో ఆదివారం కళకళలాడింది. సమీప జిల్లాల నుంచి ఎక్కువ మంది పక్షుల వీక్షణకు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ దగ్గర నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలను వీక్షించారు. కేంద్రంలో పక్షి నమూనా మ్యూజియాన్ని సందర్శించి వాటి విశేషాలు, కొల్లేరు భౌగోళిక పరిస్థితులను తెలుసుకున్నారు. చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. ఫారెస్టు బీటు ఆఫీసర్ రాజేష్ సందర్శకులకు వసతులు కల్పించారు.



చిల్డ్రన్స్ పార్కులో పర్యాటకుల సందడి

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం –చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్. గంగాశ్రీదేవి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

29న రేషన్ షాపు డీలర్ అభ్యర్థులకు పరీక్షలు

మొవ్వ: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ షాప్ డీలర్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29న ఉయ్యూరు జెడ్పీ హైస్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.మస్తాన్ ఆదివారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు 12 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు అప్లికేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.